# ప్రేమించే ప్రాణి

## కె. రామలక్ష్మి

**తెల్లారితే శుక్రవారం. లేస్తూనే చాలా వుత్సాహంగా లేచింది పార్వతి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. కిటికీ లోంచి మంచం పక్కగా బంగారం లాంటి ఎండ పడుతుంది. పెద్ద సైజు బంగారం బిస్కటులాగా తోచింది పార్వతి కది.**

రోజూ యీ ఎండ పడుతూనే వుండొచ్చు కాని సాధారణంగా కళ్ళు తెరవగానే ఏ మూలనో వున్న బూజూ, అద్దం మీద దుమ్మూ కన్పిస్తుంది. 'శుభ్రం చేయాలి' అని ఉస్సూరుమంటూ లేచేది.

కాని ఈ రోజు అలా జరగలేదు. చెరిగిన జుట్టు సద్దుకుంటూ కూతురి గదిలోకి తొంగిచూసింది పార్వతి 'లేచి చదువుకో' అని చెప్పాలని. ఆశ్చర్యం మంచం మీద బేబి లేదు.

"ఈరోజు నిజంగానే—ఏదో అద్భుతం జరిగేలా వుంది! లేపకుండా బేబి లేవడం ఏమిటి!" నవ్వుకుంటూ గబగబ వంటింటి కేసి నడిచింది పార్వతి.... చక్కటి కాఫీ వాసన.

పార్వతి అదృష్టాలలో సూకాలు ఒకటి. అదా యింట్లో పని మనిషి కాదు. పార్వతికి అత్తగారు అమ్మగారు కూడా. 'సూకాలూ బేబి ఏది?' అడగబోతున్న పార్వతి ప్రశ్న గొంతులో వుండి పోయింది. డైనింగ్ టేబులు మీద నోట్ బుక్ పెట్టి—దేంతోనో కుస్తీ పట్టోంది—బేబి. పదమూడేళ్ళ బేబీని చూస్తుంటే—ఎప్పటి కప్పుడు వింతగా వుంటుంది పార్వతికి. 'ఇదేమిటి ఇలా క్షణాలమీద మారిపోతుందీ పిల్ల" అనుకోకుండా వుండలేదు! "ఏంటి బేబీ?" అంటూ దగ్గిరకి వెళ్ళి తల మీద చేయి వేసింది. అదో ముళ్ళ కంపలాగ వుంది! ఎప్పుడే నూనె రాస్తేనా!!

'కరుణా టీచర్‌కి లెటర్ రాస్తున్నాను మమ్మీ. ఎలారాసినా సరిగ్గారావడంలేదు.... పాపం ఆవిడవెళ్ళిపోయారు. కొత్తటీచరు వస్తుందట.' బెంగగా అంటున్న బేబీ ముఖంలోకి చూస్తూ నవ్వబోయి ఆగింది పార్వతి. 'ఆ వయస్సులో అలాగే బాధగా వుంటుంది కాబోలు!' అనుకుంది....

"అరె. చెప్పలేదేం? ఎందుకెళ్ళిపోయారు" అడిగింది. "పావం. ఆవిడకి 'నెర్వస్ బ్రేక్ డౌన్' అంటే ఏమిటి మమ్మీ? అది అంటు వ్యాధా?" తల్లి నడుం చుట్టూ చేతులు చుట్టి అడిగింది బేబి.

'పాపం కరుణా టీచర్' మనస్సులోనే అనుకుంది. ఎదుటివారి బూజు అద్దంమీద దుమ్ము కనిపెట్టడం కష్టమే. అంతదుంపలా వుండి నవ్వుతూ నవ్విస్తూ వుండే కరుణ టీచర్‌కి నెర్వస్ బ్రేక్ డౌన్ ఏమిటి? ఎవరు నమ్ముతారు!' అనుకుంది.

"అంటే ఏం లేదు బేబీ ఒంట్లో బాగుండనటే ఆవిడకి మనస్సులో బాగుండ లేదన్న మాట. కాస్త రెస్టు తీసుకుంటే సద్దుకుంటుంది అందుకే వెళ్ళినట్టుంది' అంది.

ఇంతలో బాత్ రూంలోంచి ఓ కేక వినిపించింది—పార్వతీ! అని.

నాలిక్కరుచుకుంది పార్వతి. మళ్ళీ సబ్బు లేదు కాబోలు! గంగబ యివతల సింకు దగ్గిరున్న బాక్సులో ముక్కలన్నీ తడిపి ఏకం చేసి బాత్‌రూం దగ్గిరకి నడిచింది పార్వతి.

"ఇంద. సోపు తేవడం మరచిపోయాను. యీ పూట తెస్తాను" అంది. చేతిలో సోపు అందుకుంటూ చేయి గిల్లాడు కృష్ణమూర్తి. "నిన్న పేస్టులేదు. మొన్న షాంపూ లేదు యీ రోజు సోపు లేదు! అన్నీ తెల్లారిలేస్తే కావలసినవే కదా! ఎలా మరిచిపోతావో నా కర్థం కాదు." అంటూ తలుపు మూసుకున్నాడు కృష్ణమూర్తి.

'ఛ.... యీసారేనా కావలసినవన్నీ ఎప్పటి కప్పుడు జాబితా రాసేయాలి. అన్నీ ఒకేసారి తెచ్చి పడేయాలి. అదేం కర్మో- అలా సూపర్ బజారులోకి వెడితే అన్నీ మరిచి పోతాను ., ఎవరో ఒకరు కన్పిస్తే కబుర్లలో పడిపోతాను. యీసారి అలా కాదు. ముందు కొనేయాలి' అని తనకు తనే బుద్ధిచెప్పకుంది పార్వతి.

"ఏంటో నాకీ సంసారం సవ్యంగా లాగడమే చేత కావడం లేదు.... ఎప్పటి కప్పుడే మతిమరుపు!" "ఏం మమ్మీ ఏమైంది. దాడీకి రంగు రంగుల సోపు యిస్తే కోప్పడ్డారా!" చిలిపిగా అడిగింది బేబీ దాని ముఖంలోకి క్షణంపాటు తీక్షణంగా చూసింది. మరుక్షణం నవ్వేస్తూ "సిల్లీ! అన్ని సువాసనలు ఒక్కసారి వెదజల్లే సోపు-ఏ ప్రకటనలోనైనా వచ్చిందా?" అంది గబగబ సింకు దగ్గర ముఖం కడిగి కాఫీ గ్లాసు అందుకుంటూ—

"సామాన్లు కూడా రాసుకో తల్లీ. చాలా కావాలి." అంటూ హెచ్చరించింది సూకాలు 'నువ్వూనా' అన్నట్టు ఆమెకేసి చూస్తూ వూరుకుంది పార్వతి.


అందరికీ చక్కని దోసెలు వేసింది సూకాలు. కృష్ణమూర్తి హడావిడిగా బ్రీఫ్ కేసు సద్దుకుని 'నే వెడుతున్నా' అని కేకేసి బయటికి నడిచాడు. ఓ ఐదు నిమిషాల తరువాత కారు బయలు దేరిన చప్పుడు విని హమ్మయ్యా! అంటూ

కుర్చీలో కూలబడింది పార్వతి.

"ఏం చేసి అలిసి పోయావు?" అని ఎవరేనా అడిగితే పార్వతి బదులు చెప్ప లేక పోవచ్చు కాని పార్వతి అలిసి పోయింది.... "నేనెందుకిలా అరకొర పనులు చేస్తాను? అందరి గృహిణులలాగా ఇల్లు చక్కదిద్దుకోవడం ఎప్పటికి వస్తుంది నాకు? చివరికి బేబీ కూడా నాకు సలహాలిచ్చే స్థితిలో వున్నదేం?" అనుకుంటూ కళ్ళు మూసుకుంది. ఉదయాన్నే లేచినప్పటి ఉత్సాహపు ఛాయ వుండబట్టి గాని లేకపోతే- యింకా నిస్త్రాణగా పడి పోయేదే!

ఇంకా వంట యింట్లోంచి కదల కుండానే హాల్లో ఫోన్ మ్రోగడం మొదలెట్టింది-

"పోనీలే! ఏ సుందరో, సుబ్బలక్ష్మో అయితే హాయిగా హస్కు వేయవచ్చు." అంటూ లేచి ఫోన్ దగ్గరకు పరుగెత్తింది. రిసీవరు ఎత్తుతూనే "హల్లో" అంది ఆనందంగా.



"అమ్మయ్యా! ఇంకా యింట్లోనే వున్నావా? చూడు పార్వతీ నేను సాయంత్రం రాగానే ప్రయాణం వుండొచ్చు. దయచేసి చొక్కాలకి బొత్తాలు చూడు. అలాగే పేస్టు- సబ్బు- ముఖ్యం సుమా. తెస్తావు కదూ!" నవ్వుతూనే హెచ్చరిస్తున్నట్టు అంటున్న కృష్ణమూర్తి గొంతువిని కాస్త నిరుత్సాహం కల్గినా దాన్ని వదుల్చుకుని 'సారీ కృష్ణా. అన్నీ రెడీ చేస్తానులే' అంది.

"గుడ్ అది చెప్పాలనే ఫోన్ చేశాను. బై దిబై బేబీకి నెర్వస్ బ్రేక్ డౌన్ అంటే ఏమిటో చెప్ప గల్గావా? పొద్దుటే నన్నడిగిందే" అన్నాడు నవ్వుతూ. 'నువ్వెందుకు చెప్పలేదు?"

"అలాంటివి చెప్పడం తల్లుల బాధ్యత పార్వతీ. అందుకే నీకు వదిలేశా.... పెట్టేస్తున్నా...." అంటూ ఫోన్ పెట్టేశాడు.

కాస్సేపలాగే నిలబడి పోయింది పార్వతి. ఏం మగాళ్ళు?

"ఏం మమ్మీ .. డాడీనా?" అన్న బేబీ ప్రశ్నకి ఉలిక్కి పడింది పార్వతి.

"అవును సాయంత్రం వూరికెడతారట డాడీ."

"అయితే నాకు బోల్డు పని" నవ్వింది బేబీ.

"తెరచిన పుస్తకంలా చదివేస్తుంది నన్ను!" నవ్వుకుంది పార్వతి...

"నేను గబ గబ తెమిలి బజారు కెళ్ళాలి." పైకి అంటూ బట్టలు తీసుకుందుకు బీరువా ముందు నిలబడింది.

"నాకు కొత్త టీచరు నచ్చదు.... ఉట్టినే అరుస్తుంది! మేం ఏం చేసినా తప్పే! త్వరగా చేస్తే త్వరగా చేశారంటుంది! మెల్లిగా చేస్తే ఎందుకంత మెల్లిగా చేశా రంటుంది. ఐ హేట్ హెర్! గోల చేశామంటుంది... నేను స్కూలుకే వెళ్ళను." కాస్త కోపంగా, విసుగ్గా కొత్త టీచరు పట్ల తన అభిప్రాయం ప్రకటించింది బేబీ

"పాపం ఆవిడకి కొత్తే కదా. అందుకే అలా వుండి వుంటుంది. మనస్సులో ఎంతో పిరికిగా వుండ బట్టే ఆలా కోప్పడి వుంటుంది. రెండు రోజులు పోతే- మామూలై పోదా! పిచ్చిగాని" బట్టలు తీసుకుంటూనే కూతురికి బుద్ధులు చెప్పింది

పార్వతి.

తల్లి ముఖంలోకి వింతగా చూస్తూ "ముఖంలోకి చూడకుండా మాటాడుతావేం?" అంది బేబీ. అదిరిపడి చేతిలో చీర వదిలేసి బేబీ ముఖంలోకి చూసింది పార్వతి. ఏమిటీ పిల్ల ధోరణి? అనుకుంది. ఇంకా బయటకి వెళ్ళే మూడ్ పోయింది పార్వతికి. నూకాలు పనిచేస్తుంటే అదీ ఇదీ సర్దుతూ కాలక్షేపం చేసింది.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాయి.

ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది.

పార్వతి మటుకు పడుకుందేకాని కళ్ళు మూత పడటం లేదు. ఎందుకంత రూడ్‌గా మాట్లాడుతుంది బేబీ ఒకొక్కప్పుడు? అని ప్రశ్నించుకుంటుంది.... తల్లి మీద పిసరంత గౌరవం వున్నట్టు తోచదు. ఇలాగేవుంటుందా? మారుతుందా? ఏమో.... లేకపోతే 'ఎలా పెంచిదిరా బాబూ' అనినన్నే అనుకుంటారు.... ఏవేమిటో ఊహలు అల్లి బిల్లిగా అల్లుకు పోతున్నాయి.

ఇంతల్లో 'అంతా ఎక్కడ' అంటూ కృష్ణమూర్తి విసురుగా వచ్చి బ్రీఫ్‌కేసు సోఫాలోకి విసిరాడు. ఆ తీరు చూడగానే 'ఈ రోజు ఏదో జరిగివుంటుంది.' అనుకుంటూ 'ఇదిగో వస్తున్నా' అంటూ వెళ్ళింది పార్వతి. "నేను టూర్ వెళ్ళడం లేదు." అన్నాడు సోఫాలో కూలబడుతూ.

'అరె చొక్కాలకి బొత్తాల సంగతే మరచిపోయానే' అని మనస్సులోనే తిట్టుకుంది పార్వతి. పైకి మటుకు "ఏం? ప్లాను మారిందా?" అతని దగ్గిరగా కూర్చుంటూ అడిగింది.

భార్యని దగ్గిరగా లాక్కుంటూ.

"ఏమిటీ? నువ్వు "కలగాయి సోపు" తోనే స్నానం చేసినట్టుంది?" అన్నాడు నవ్వుతూ.

'పోనీలే—యీ వంకన నా షర్టులన్నీ సరిగ్గా వుంటాయి బొత్తాలతో! అవునా? నా బదులు మూర్తి వెడుతున్నాడు." అన్నాడు.

'అయ్యో! కృష్ణా—బంగారం బిస్కట్టు లాంటి ఎండ నీకూ ఉత్సాహం లేలేదీ పూట...." అనుకుంది. "స్నానం చెయ్యి త్వరగా భోజనం చేద్దాం. ఏదైనా సినిమాకేనా వెడదాం" అంది ఉత్సాహంగా. "బేబీ ఏదీ?" అడిగాడు కష్ణమూర్తి.

"నూకాలుకి చెపుతుంది వాళ్ళ కరుణా టీచర్‌కి ఏమైందో." నవ్వుతూ చెప్పింది.

అంతా కబురాడుతూ భోజనాలకి కూర్చున్నారు. నూకాలు వేడి వేడిగా అన్నం అందిస్తోంది.

"టోమెటో వుంటే కోసివ్వు" అన్నాడు కృష్ణమూర్తి గాలిలో విసిరిన ఆ మాట పేల బోతుందా అనిపించింది పార్వతికి.

'ఛ. ఏం మనిషిని! అన్ని మరచి పోవడమే' అని ఒక్క ఉదుటున లేచింది.

"ఎక్కడికి?" ఆపుతూ అడిగాడు.

'ఒక్క క్షణం పక్కింటి మామి దగ్గిర ఓ టోమెటో బదులు తెస్తా రేపిచ్చేస్తా' అంటూ మాట కోసం ఆగకుండా వీధి తలుపుతెరచి దూసుకు పోయింది పార్వతి. ఆమె వీపు మీద పరుచుకున్న జుట్టు వేగంగా కదులుతున్న నల్ల మేఘంలా కనిపించింది. క్షణంసేపు "నీకు పిచ్చిగాని కాదు కదా?" వెనక నుంచి అరిచాడు కృష్ణమూర్తి.

"మామి యింట్లో వుంటాయి బాబూ, కానివ్వండి" నెమ్మదిగా అంది నూకాలు.

"అన్నీతనూ పెట్టుకోవచ్చుగా రోజంతా ఏం చేసింది. యింటికి కావలసినవి తెచ్చి పడేసు కుందుకేం?" విసుక్కున్నాడు కృష్ణమూర్తి .... భోజనం ముగించాడు. టోమెటో మీద ఆశ పోయింది.

కాని పార్వతి ఇంకా రాలేదు.

పక్కింటి మామీ తలుపు తెరుస్తూనే 'రా రా పార్వతీ ఎన్న?' అంటూ పిలుచుకెళ్ళింది. ఏడ్చినట్టు కళ్ళు ఉబ్బిఉన్నాయి మామీకి. 'ఏం మామీ? ఏమైంది?' ఆత్రంగా అడిగింది. 'ఎన్న' అని చెప్పనే తల్లీ! మనసు విరిగి పోయింది మామా లేటు?" అంటూ బాధ వెళ్ళకక్కుకోవడం ప్రారంభించింది మామ. 'పాపం' సానుభూతి కోసం ప్రాణం ఎంత కొట్టుకు పోయిందో....' అనుకుంటూ వినసాగింది పార్వతి. ఛ. కరుణా టీచర్‌కి మనస్సు కష్టం, మామికి మనస్సు కష్టం.... అందరికళ్ళల్లో బూజు శోతన కళ్ళలో ఈరోజే పడాలా? బంగారంలా మెరిసే వెల్గు చూపి లేచానే అనుకుంది పార్వతి. అప్పటికే గంట దాటి పోయింది ఏదో పెద్ద భారాలు కృంగతీయవు. వెల్గులు వెదజల్లే చిరు సంఘటన లే.... జీవితంలో దైనందిన కార్యక్రమంలో తగిలే ఎత్తు పల్లాలు.... అనంతమైనవిసిగించే కృంగతీసే.... చిన్న చిన్న భంగపాట్లు ఇవే— చివరికి మనిషిని పడేస్తా ు కాబోలు లేకపోతే మామియిలా అవడం ఏమిటి? ఎవరేనా చెప్పినా నమ్ముతారా?' అనుకుంది పార్వతి. 'అరె! వచ్చిన సంగతి మరిచాను మామి రెండు టక్కాళి యివ్వండి. రేపు తెస్తాను' అంది 'అదే వ్నడీ? తెరపి కుడుకుకదు? ఇంద" అంటూ ఎంపుల్లా మెరుస్తున్న రెండు టమెటోలు తెచ్చి యిచ్చింది.

"ఎప్పుడేనా రా. కూర్చుని కబుర్లు చెప్పుకుందాం" అంటూ గుమ్మం దాకా సాగనంపింది పార్వతిని. పార్వతి కప్పుడు బల్ల దగ్గిర భోజనానికి కూర్చున్న కృష్ణమూర్తి చటుక్కున జ్ఞాపకం వచ్చాడు.

అయ్యో. ఎంతోసేపై వుంటుంది అనుకుంటూ గబ గబ యింట్లోకి జొరబడింది.

"ఏమై పోయావు?" హాల్లో కూర్చున్న

## నిరీక్షణ

ఎన్నాళ్ళనుంచో
నీ రాకకై ఎదురుచూస్తూ
ఆనంద శిఖరాల్ని అధిరోహిస్తూ
ఊహల ఊయల్లో
ఊగుతున్నానో తెలుసా!
అంతలో
నీ వొచ్చావు, వెళ్ళావు?
ఇన్నాళ్ళూ నీ రాక కోసం
ఎదురు చూసింది ఇందుకా?
అందుకే నా హృదయం
రాయిగా మారి
నీ పై మమతనీ, నా ఆశల్నీ
సమాధి చేసేసింది!
ఆపై నాలో ప్రేమజ్వాలగా రగిలి,
నా జీవితాన్నే గుగ్గిపాలు చేసింది!

—ప్రసాద్

కృష్ణమూర్తి అడిగాడు. అతని ముఖంలో కోపం కంటే బాధ ఎక్కువగా వుంది.

"టమేటో వుందా? అని అడిగాను. లేకపోతే అలా పరుగెత్తాలా? టమేటో లేకపోతే భోజనం గడవదా పార్వతీ. ఎంత నేపైందో నువ్వెళ్ళి తెలుసా?" ఆమె చేయి అందుకుంటూ అడిగాడు కృష్ణమూర్తి. పార్వతి మనస్సు ఎంతగా తేలికైంది.

"నిజమే. టమేటో జీవితావసరం కాదు గడుస్తుంది- లేకపోయినా.. కృష్ణా మామి లేదు? అని చెప్పబోయింది.

"బేబీ వెళ్ళి పడుకోకూడదూ?" అక్కడే వున్న కుతూర్ని హెచ్చరించాడు కృష్ణమూర్తి.

బేబీ మాట్లాడకుండా పుస్తకాలు పట్టుకుని లోపలికి చక్కా పోయింది.

"చూశావా! నువ్వు చెప్తే అలా వింటుంది. నేనైతే సవా లక్ష ప్రశ్నలు వేస్తుంది" అంది పార్వతి.

"నువ్వు తల్లివి. నిన్ను కాక ఎవర్నెదిరిస్తుంది? పార్వతీ. రా పోదాం...." అంటూ భార్యని తమ గదిలోకి నడిపించాడు.

నూకాలు తలుపులు వేసి లైట్లార్పి నిద్రకి ఒరిగింది.

కాని పార్వతి భర్త గుండెలపై తల వాల్చి కబుర్లు చెప్తూనే వుంది. "మామా యింట్లో లేరు. మామి చాలా ఢీలా పడిపోయారు.. ఎందుకో అసలు యిల్లు పట్టకుండా తిరుగుతాడు మామా. పాపం ఎప్పుడూ కృంగిపోతుంది." నొచ్చుకుంది పార్వతి.

"పార్వతీ జీవితం రంగుల హరివిల్లు. దాన్ని చూసే పద్ధతిలో వుంటుంది-సుఖం-దుఃఖం...."

"కాదు కృష్ణా, ఇల్లాలు అర్థం చేసుకోవడంలో వుంటుంది. నేను చూడు-నేను లేకపోతే గడవదనుకుంటాను. జీవితాన్ని అనవసరంగా ఇక్కడ చిక్కులు వేసి అక్కడ విడదీయడానికి సతమతమైపోతుంటాను. నానేర్పు నాకే అర్థం కాదు. ఎవరికీ ఇదీ అని చూపెట్టాలేను. కాని...."

"కాని ఏమిటి పార్వతీ... నేచెప్పానుగా టొమేటో జీవితావసరాలలో అతి ముఖ్యం కాదు, అలాగే టూత్‌పేస్టు షాంపూ సోపూ.. జీవితంలో వీటికి మించినవి వున్నాయి. నువ్వు టొమెటో కోసం మామి యింటికి పరుగెత్తినప్పుడు ఏమనుకున్నానో తెలుసా?" ఆమె జుట్టు నవరిస్తూ అడిగాడు.

"ఏమనుకున్నావు కృష్ణా?" ఆత్రుతగా అడిగింది.

"పార్వతి ముఖ్యం. మిగిలినవన్నీ కాదనుకున్నాను. అందుకే నీ అస్తవ్యస్తపు పద్ధతులు నాకు కోపం తెప్పించవు. నీమీద ప్రేమని పెంచుతాయి." అన్నాడు చేతులామె చుట్టూ బిగిస్తూ.

"లేదు కృష్ణా, ఇక నేను జాగ్రత్తగా వుంటాను" అంది-

ఒద్దు. ఆదర్శ గృహిణివైతే నీలో అమాయకత్వంపోతుంది." ఆమెనుదిటిపై ముద్దుపెట్టుకుంటూ అన్నాడు కృష్ణమూర్తి.


దీపావళి శుభాకాంక్షలతో



అప్సర గ్రూప్ ఆఫ్ థియేటర్స్
కడప

PHONE NO: Theatre : 2575
Office : 2732
Residence : 2564
K. Nagamuni Residence : 2967
M. Yard : 2759
Venkateswara : 3055

Well Noted Theatres To Screen Top Rank Pictures

**Equipped With Bauer II Imported Cinema Scope.**

అప్సర
మినీ అప్సర
వెంకటేశ్వర

PROPRITORS :

**Sri K. Nagamuni**
**Sri K. Krishnaiah**
**Sri K. Subbaramaiah**
**Sri K. Ramachandraiah**